క్లుప్తంగా

కోట సత్తెమ్మను దర్శించిన కొవ్వూరు డీఎస్పీ



డీఎస్పీ వీఎస్ఎన్ వర్మకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈఓ

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలోని కోట సత్తెమ్మ అమ్మవారిని కొవ్వూరు డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ) పర్యవేక్షణలో డీఎస్పీ వీఎస్ఎన్ వర్మకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి, సన్మానించారు. పూజా కార్యక్రమాల్లో అర్చకులు అప్పారావు శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

చాగల్లు: మండలంలో గ్రామ సచివాలయాల పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీవో బి.రాం ప్రసాద్ తెలిపారు. మార్కొండపాడులో (బీసీ సీ మహిళ), చిక్కాల-1లో (బీసీ-డీ జనరల్), ఊనగట్ల-1లో 2 పోస్టులకు గాను (జనరల్, బీసీ- బీ మహిళ) కలవలపల్లి-1లో ఒక పోస్టుకు(జనరల్-మహిళ) అభ్యర్థులు వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నిడదవోలు రూరల్: మండల పరిధిలోని ఏడు వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంపీడీఓ పి.శామ్యేలు గురువారం తెలిపారు. అట్లపాడు (బీసీ-డీ), గోపవరం -2(బీసీ-బీ), (ఎస్సీ), కంసాలిపాలెం (జనరల్), మునిపల్లి (ఎస్టీ), సింగవరం (జనరల్), ఉనకరమిల్లి (ఎస్సీ) పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు జూలై ఒకటో తేదీ నుంచి 4వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

పెరవలి: కాకరపర్రులో పంట పొలాల మధ్య పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురు జూదరులను పట్టుకున్నారు. పెరవలి ఎస్ఐ ఎం.సూర్యభగవాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకరపర్రులో పేకాట ఆడుతున్నారని సమాచారం అందడంతో గురువారం మధ్యాహ్నం దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.5500లు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

చాగల్లు: చాగల్లు-నెలటూరు లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చాగల్లులో వృద్ధాశ్రమంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ కొత్తపల్లి రవికుమార్ మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ ముందంజలో ఉందన్నారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడిగా కోడి సూర్యప్రకాశరావు, కార్యదర్శిగా ఆళ్ల వెంకట సత్యనారాయణ తదితరులతో ప్రమాణ స్వీకారం చేయించారు. క్లబ్ పూర్వపు అధ్యక్షుడు పి. సత్యనారాయణను ఘనంగా సత్కరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

నిడదవోలు : పట్టణ నాలుగో వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వద్దిరెడ్డి శ్రీనివాస్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు గురువారం శ్రీనివాస్‌ను కలుసుకుని పరామర్శించారు. శ్రీనివాస్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారయణ, వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్ కొత్తపల్లి సుప్రియ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

నిడదవోలు : మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఏడుగురికి గాయాలు

దేవరపల్లి: గోపాలపురంలో ఎదురెదురుగా వస్తున్న లారీ, తెలంగాణాకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురు గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురిని రాజమండ్రి ఆసుపత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణాలోని నాగర్‌కర్నూలు డిపో నుంచి 45 మంది ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు బుధవారం రాజమహేంద్రవరం బయలుదేరింది. గురువారం ఉదయం 5 గంటల సమయంలో గోపాలపురంలోని దొండపూడి అడ్డరోడ్డు వద్ద బస్సును ఎదురుగా జంగారెడ్డిగూడెం వైపు వెళుతున్న లారీ ఢీకొంది. దీంతో బస్సు రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మను ఢీకొంది. బస్సు డ్రైవర్ నిద్రమత్తు కారణంగా ప్రమాదం జరిగిటనట్టు పోలీసులు భావిస్తున్నారు. ఉప్పాడ సత్యనారాయణ(సీతానగరం), కొవ్వూరు మండలం వేములూరు చెందిన నిఖిల్, తునికి చెందిన వెంకటేష్, రాజమండ్రికి చెందిన నిషిక, వెంకట్రావు ఉన్నారు. కాకినాడకు చెందిన వృద్ధురాలు పాకా పుష్ప పరిస్థితి విషయంగా ఉండడంతో 108లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

విద్యార్థి చూపు.. సర్కారు కళాశాల వైపు..

- సర్కారు కళాశాలల్లో అడ్మిషన్ల జోరు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు

నిడదవోలు: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు డిమాండ్ పెరిగింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పాఠశాలలు, కళాశాలలను నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేస్తున్నారు. మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు తదితర వసతులు కల్పించడంతో అందరి చూపు వాటిపై పడింది. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చేందుకు ముందుకొస్తున్నారు. దీంతో అడ్మిషన్లకు డిమాండ్ పెరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయి. ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో చదివే విద్యార్థులే కాకుండా ఇంటర్మీడియెట్ చదివే వారి తల్లుల ఖాతాలకు కూడా ప్రభుత్వం అమ్మఒడి వేస్తోంది.

బాలుర కళాశాలలో..

నిడదవోలు పట్టణంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ ఒకటో తేదీ నుంచి జూనియర్ కళాశాలలు అధికారికంగా పని చేస్తున్నాయి. ఎండల తీవ్రతకు విద్యార్థులు తక్కువగా హాజరైన ప్రస్తుతం వాతావరణం మారడంతో విద్యార్థులు కళాశాల బాట పట్టారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం ఉన్నాయి. సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో సీఎస్ఈ, ఈటీ, ఈఈటీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం 80 మంది విద్యార్థులు ఇంటర్ అడ్మిషన్లు తీసుకున్నాయి. గత ఏడాది సుమారు 200 మంది అడ్మిషన్లు తీసుకున్నారు. సీట్ల భర్తీకి పరిమితి లేదని ప్రిన్సిపాల్ మేరి సుజాత పేర్కొన్నారు. నాడు-నేడు పథకంలో భాగంగా రూ.1.09 కోట్లతో కళాశాల అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి.



ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

బాలికల కళాశాలలో..

ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఈఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో ఇప్పటివరకూ 142 మంది అడ్మిషన్లు పొందారు. గతేడాది 223 మంది అడ్మిషన్లు పొందారు. ఇక్కడ కళాశాల అభివృద్ధికి నాడు-నేడు పథకంలో 78.39 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. కళాశాలల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు పనులు జరుగుతున్నాయి. రెండో సంవత్సర విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. పదో తరగతి సప్లమెంటరీ పరీక్ష ఫలితాలు రావడంతో అడ్మిషన్లు మరింతగా పెరిగాయిని ప్రిన్సిపాల్ నడిపల్లి సరితాదేవి చెబుతున్నారు.

ఈ ఏడాది విద్యా ప్రణాళిక ఇలా..

ఈ ఏడాది 2023-24 విద్యా సంవత్సరంలో జూనియర్ కళాశాల్లో 227 రోజులు పని దినాలు ఉండేలా ఇంటర్మీడియెట్ బోర్డు విద్యా ప్రణాళికను విడుదల చేసింది. జూలై 26 తేదీ నుంచి 28వ తేదీ వరకూ మొదటి యూనిట్, ఆగస్టు 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ సెకండ్ యూనిట్ పరీక్షలు నిర్వహించనున్నారు. అదే విధంగా మూడో యూనిట్ పరీక్షలు అక్టోబర్ 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. నాలుగో యూనిట్ పరీక్షలు నవంబర్ 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, ఆరు నెలల పరీక్షలు డిసెంబర్ 18వ తేదీ నుంచి 28వ తేదీ వరకూ ఉంటాయి. 2024లో సంకాంతి సెలవులు జనవరి 11 నుంచి 17 వరకు ఇవ్వనున్నారు. ప్రీ ఫైనల్ పరీక్షలు 2024 జనవరి 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు, ఫిబ్రవరి రెండో వారంలో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. వార్షిక పరీక్షలు మార్చి మొదటి వారంలో నిర్వహించేలా విద్య ప్రణాళికలను ఇంటర్ బోర్డు ప్రకటించిందని కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు.



బాలికల జూనియర్ కళాశాలలో పిల్లల అడ్మిషన్లను తల్లులకు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సరితాదేవి

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు చొరవతో..

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు చొరవతోనే నిడదవోలు నియోజకవర్గంలో కళాశాలలకు మహర్దశ పట్టింది. ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కళాశాలలకు అవసరమైన నిధులు మంజూరు చేయించారు. దీంతో మా కళాశాల నాడు-నేడు పథకం రెండో విడతలో ఆధునీకరించారు. నాడు-నేడు పథకంలో ప్రభుత్వం నిధులు మంజూరయ్యాయి. కళాశాలలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. పదో తరగతి పాసూన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పడానికి ముందుకు వస్తున్నారు.

– బి.మేరి సుజాత, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలుర జూనియర కళాశాల, నిడదవోలు

చదువుకునే వాతావరణం



ఈ కళాశాలలో మంచి సౌకర్యాలు ఉండడంతో ఒకేషల్ ఎంఈటీ కోర్సులో చేరాను. ఇక్కడ పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉన్నారు. ఇక్కడ చదువుకుంటే పాస్ అవ్వడం ఖాయం. కేషనల్ కోర్సుకు సంబంధించి ల్యాబ్‌లు ఉన్నాయి. అన్ని పాఠ్యాంశాలను చక్కగా వివరించి అర్థమయ్యేలా చెబుతున్నారు. ఇక్కడ చదువుకునే వాతావరణం కల్పిస్తున్నారు.

– ఆర్.సంజయ్, ఫస్ట్ ఇయర్, నిడదవోలు

అర్హత ఉంటే 90 రోజుల్లో ఇంటి స్థలం



సింగవరంలో లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: ప్రతి పేదవాడి సొంతింటి కలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సింగవరంలో పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా ఇంటిస్థలం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అర్హత ఉంటే 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. ఇలా 15 మందికి ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే గురువారం అందజేశారు. ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, సర్పంచ్ పెన్మెత్స వెంకటలక్ష్మి, ఎంపీటీసీ నిర్మల, సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షం కోసం సంబరాలు

నల్లజర్ల: వర్షాలు కురవాలి పంటలు సమృద్ధిగా పండాలంటూ అనంతపల్లి గ్రామ దేవత దండు గంగాభవానీ అమ్మవారికి గురువారం సంబంరం నిర్వహించారు. గ్రామ రైతులు డప్పువాయిద్యాలు, గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించి, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిరాల శరణ్య, కమిటీ చైర్మన్ పోకల నాగేశ్వరావు, ఉపసర్పంచ్ కలం సత్యనారాయణ, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, పోకల నరసింహారావు, ప్రత్తి మురళీ, జడ్డు సూర్యనారాయణ, నిమ్మకాయల హనుమంతరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిడదవోలు రూరల్: ప్రతి ఇంటికీ రక్షిత తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా సింగవరంలో 53.08 లక్షలు, మునిపల్లిలో రూ.30.03 లక్షలతో నిర్మించే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్ నిర్మాణం, తాగునీటి కుళాయిలు, పైపులైన్ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపన చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న 6 నెలల్లో తాగునీటి సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని హామీ ఇచ్చారు. నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించిందని చెప్పారు. మంచి చేసిన సీఎం జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. జూలై ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా 11 రకాల సర్టిఫికెట్లు సర్వీస్ చార్జీ లేకుండా జారీ చేయడంతో పాటు నూరుశాతం ప్రజావినతులు పరిష్కరిస్తామన్నారు. మళ్లీ మోసపూరిత హామీలతో ఓట్ల కోసం వచ్చే టీడీపీ, జనసేన నాయకులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అందిన లబ్ధి వివరాల బ్యాంక్ బుక్‌లను లబ్ధిదారులంతా చూపించి బుద్ధి చెప్పాలన్నారు. మునిపల్లిలో 30 ఏళ్లనాటి తాగునీటి సమస్య పరిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడును గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, సర్పంచులు పెన్మెత్స వెంకటలక్ష్మి, వెలగన నరేష్, తిక్కా శ్రీనివాస్, ఎంపీటీసీలు పెన్మెత్స నిర్మల, కొర్లపాటి మోహన్, సొసైటీ అధ్యక్షుడు పెన్మెత్స చందు, యాళ్ల రామారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



మునిపల్లిలో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

సంతృప్తిగా పథకాలు అందించడమే లక్ష్యం

- హోమ్ మంత్రి తానేటి వనిత
- జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన

కొవ్వూరు: అర్హులైన వారందరికీ సంతృప్తి స్థాయిలో ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర హోమ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. గురువారం పట్టణంలో క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులతో జగనన్న సురక్ష కార్యక్రమంపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, కొత్త కార్డులు అందజేయడం, భూముల మ్యూటేషన్ వంటి 11 రకాల సేవలను అందించనున్నట్టు తెలిపారు. అర్హత ఉన్నవారందరూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇప్పటికే వలంటీర్లు, గృహసారథులు ఇంటింటా సర్వే చేసి సమస్యలు గుర్తించి టోకెన్ అందజేశారన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి ప్రతి మండలంలోను రెండు టీంలు సభలు నిర్వహిస్తాయన్నారు. ఒక్కో రోజు ఒక్కో సచివాలయ పరిధిలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సభలు జరుగుతాయన్నారు. ఆ గ్రామం, వార్డులో ఉండే ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులంతా భాగస్వాములు కావాలని మంత్రి సూచించారు. ఏ ఇంట్లో ఏ సమస్య ఉన్నా నాయకులు చిత్తశుద్ధితో ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు.



కొవ్వూరులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హోమ్ మంత్రి తానేటి వనిత

అనంతరం గ్రామాలోని కొన్ని సమస్యలను మంత్రికి వివరించారు. అంతకు ముందు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు రుత్తల భాస్కరరావు, నగళ్ల పాటి శ్రీనివాస్, మండల గౌరవ అధ్యక్షుడు గన్నమని వీర వెంకట్రాజు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు చొటుపల్లి వీరన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి, నాయకులు లకంసాని సూర్యప్రకాశరావు, నక్కా చిట్టిబాబు, సుంకర రాయుడు, ఉప్పులూరి సూరిబాబు, తోట రామకృష్ణ,కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మత్స్య వినియోగం పెంచేందుకే ఫిష్ ఆంధ్రా

ఫిష్ ఆంధ్రా కార్యక్రమం ద్వారా మత్స్య ఉత్పత్తుల వినియోగాన్ని పెంచడం, నాణ్యమైన బతికి ఉన్న తాజా చేపలు విక్రయించడమే ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. గురువారం పట్టణంలో క్యాంపు కార్యాలయం వద్ద నూతనంగా లైవ్ ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహానాన్ని ఆమె ప్రారంభించారు. పట్టణంలో శ్రీనివాసపురానికి చెందిన కర్రి రాహుల్ బాబుకి రూ.20లక్షల విలువైన ఫిష్ ట్రాన్స్‌పోర్టు వాహానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 శాతం సబ్సిడీపై అందించారు.

మానవత నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న మానవత నూతన కార్యవర్గం

తాళ్లపూడి: మానవత స్వచ్ఛంద సంస్థ తాళ్లపూడి మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. తాళ్లపూడిలోని సాసలన దమయంతి ఆర్య వైస్య కల్యాణ మండపంలో ప్రస్తుత అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా సాయన సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా అంకెం సురేష్, సెక్రటరీగా తిరిగిపల్లి చినదోసయ్య, ట్రెజరర్‌గా అప్పన హనుమంత రావు, జాయింట్ సెక్రటరీగా పెమ్మాడి దుర్గాప్రసాద్, ఈసీ మెంబర్స్‌గా ఇంజరపు వెంకట కృష్ణ శ్రీనివాస్, అబ్బిశెట్టి ప్రసాద్, తిగిరిపల్లి రామన్న, సనపల రాజశేఖర్ తదితరులతో మానవత జిల్లా అధ్యక్షుడు గంగాధరం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మానవత సంస్థ గౌరవాధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మానవత్వం కలిగి ఉండి ఇతరుకు సేవలు అందించాలన్నారు. మానవత సభ్యులు వి.చంద్రయ్య, సీహెచ్ ఆంజనేయులు, గోకవరపు బాబులు, వీరమల్లు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు సాగునీరు విడుదల

నిడదవోలు: ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు దశల వారీగా నీటిని విడుదల చేస్తున్నారు. రైతుల సాగునీటి అవసరాల మేరకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలో భాగంగా మండలంలోని విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు గురువారం 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పుడెల్టాకు 2130 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1530 క్యూసెక్కులు వదిలి పెట్టారు. పశ్చిమడెల్టా పరిధిలో ఏలూరు కాలువకు 753 క్యూసెక్కులు, తణుకు కాలువకు 536 క్యూసెకులు, ఉండి కాలువకు 578 క్యూసెక్కులు, నరసాపురం కాలువకు 1281 క్యూసెక్కులు, అత్తిలి కాలువకు 390 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

గృహ సారథి మండల ఇన్‌చార్జిల నియామకం

రాజమహేంద్రవరం సిటీ: జగనన్న గృహసారథుల మండల ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మండలం	ఇన్‌చార్జి
దేవరపల్లి	కాసులూరి సతీష్
ద్వారకా తిరుమల	బొగ్గవరపు కృష్ణ శేషసాయి
గోపాలపురం	టి. సత్యనారాయణ
నల్ల జర్ల	కటారి రాజ్‌కుమార్
కొవ్వూరు	నాగళ్లపాటి శ్రీనివాసరావు
చాగల్లు	గోసాల నాగార్జున
తాళ్లపూడి	ముళ్ల పోసిబాబు
నిడదవోలు	వెలగాన పోలయ్య
నిడదవోలు మున్సిపాలిటీ	ఖాన్ బాషా షేక్
పెరవలి	రామడుగుల సూర్యనారాయణ
ఉండ్రాజవరం	కటారి సిద్ధార్థ వర్మ

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

దేవరపల్లి: అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలు పొందాలని, అందుకే జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. గుడ్డిగూడెంలో గురువారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, సర్పంచ్ మడిచర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు, సర్పంచ్‌లు ఇళ్ల శ్రీరామూర్తి, పఠాన్ అన్సర్‌బాషా, సగ్గొండ సర్పంచ్ యంటపల్లి శేఖర్‌బాబు, పార్టీ నాయకులు వెలగా శ్రీరామూర్తి, యంటపల్లి సూరిబాబు, గృహసారథుల మండల కన్వీనర్ తానింకి సత్యనారాయణ, వలంటీర్లు పాల్గొన్నారు. దేవరపల్లి మండలం లక్ష్మీపురంలో వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

నిడదవోలు : ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందని మున్సిపల్ వైస్ చైర్మన్ గంగుల వెంకటలక్ష్మీ అన్నారు. పట్టణంలో 4 వ వార్డులో గురువారం జగనన్న సురక్ష పథకంలో భాగంగా ఇంటింటా సర్వే చేపట్టారు. భవాని, గోపియాదవ్, గుడ్ల సత్యనారాయణ, సతీష్, సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



గుడ్డిగూడెంలో జరిగిన కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తలారి

త్యాగమయ జీవితం.. బక్రీద్ సందేశం

నిడదవోలు రూరల్: ప్రవక్త ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పండగని పెద్దమసీదు ముతావలీ మహబూబ్ షరీఫ్ అన్నారు. సమిశ్రగూడెం, తాడిమళ్ల, కోరుమామిడి, పెండ్యాల మసీదుల్లో ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్లింలు తమ స్థోమతలను బట్టి ఖుర్బానీ సమర్పించారు.

నిడదవోలు: పట్టణంలోని బస్టాండ్‌సెంటర్ మసీదు, చినమసీదు, కురేషియా మసీదుల్లో ముస్లింలు నమాజ్‌లు నిర్వహించారు. పట్టణంలోని ఈద్గాలో జామియా మసీదు (పెదమసీదు) కమిటీ ఆధ్వర్యంలో బసీదు గురువు ఎస్‌కే అజాముద్దీన్ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు చేశారు.

తాళ్లపూడి: త్యాగాలకు ప్రతీకగా జరుపుకొనే పండగ బక్రీద్ అని తాళ్లపూడి మసీదు ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం సర్దార్ అన్నారు. తాళ్లపూడిలోని మస్జీద్ ఏ అబూబాకర్ ప్రత్యేక నమాజు చేశారు. వేగేశ్వరపురంలోని మసీదులో నమాజు చేశారు.

ఉండ్రాజవరం: మండల కేంద్రమైన ఉండ్రాజవరం, వేలివెన్ను, మోర్త గ్రామాల్లోని మసీదులలో ముస్లింలు నమాజ్ చేశారు.



నిడదవోలులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కొవ్వూరు: పట్టణంలో మజీయా, మస్కజ్ మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. అనంతరం ఏటి గట్టు సమీపంలో ఉన్న కబర్‌స్థాన్‌లో తమ పూర్వీకులకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లీం మత పెద్దలు నౌషద్ ఆలీ, మస్కజ్ మసీదు అధ్యక్షుడు అబ్దుల్ సలీమ్, కో-ఆప్షన్ సభ్యులు ఎస్‌కే అహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

నారుమడిలో ఎరువుల యాజమాన్యం

పెరవలి: నారుమడి తయారీలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి మేరీ కిరణ్ వివరించారు. సార్వాలో ఆరోగ్యవంతమైన నారుమడి పెంచడానికి రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఎరువుల యాజమాన్య పద్ధతులు గురించి ఆమె వివరించారు. త్వరగా మొలకెత్తాలనే ఉద్దేశంతో రైతులు ఎరువులు అధికంగా వేయడం, తెగుళ్ల నివారణకు పురుగు మందులు ఎక్కువగా వినియోగించడం చేస్తారు. కానీ అలా చేయడం వల్ల పంటకు నష్టం కలుగుతుందని, జాగ్రత్తగా నారుమడి వేసుకోవాలన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

తాళ్లపూడి: తొలి ఏకాదశి పూజలు మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేగేశ్వరపురంలోని పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహితకనకదుర్గమ్మ ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి గ్రామస్తులు సారె సమర్పించారు. వివిధ రకాల నైవేద్యాలను నివేదించారు. మదన గోపాల స్వామి ఆలయంలో పూజలు చేశారు.

శాకాంబరీగా ముత్యాలమ్మ

ఉండ్రాజవరం: ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా ఉండ్రాజవరం గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారు గురువారం శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వంద కేజీల వివిధ రకాల కూరగాయాలతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచి మహిళలు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచే భక్తులు స్వామి వారికి దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని చర్యలు తీసుకున్నారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గరుఢ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.



తాళ్లపూడి గ్రామస్తులు అమ్మవారికి సమర్పించిన సారె

నిడదవోలు: తొలి ఏకాదశి సందర్భంగా స్థానిక మదన గోపాలస్వామి వారిని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు దర్శించుకున్నారు. ఆలయ ఈవో నామా సూర్యప్రకాశరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగులు వెంకటలక్ష్మీ, కౌన్సిలర్లు కామిశెట్టి వెంకటరమణ, కొత్తపల్లి సుప్రియ, గోపిరెడ్డి శ్రీనివాస్, బిర్రె పార్వతి, వంగా నాగేశ్వరరావు, గంగుల గోపియాదవ్, ప్రధాన అర్చకులు గోవర్ధన దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. పట్టణంలో ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



కూరగాయలతో ముత్యాలమ్మకు అలంకరణ